రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పొదెం

భద్రాచలం, జూలై 12 : హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా (టీజీఎఫ్‌డీసీ)గా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై పొదెం వీరయ్యను అభినందించారు. భద్రాచలం నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేశ్‌కుమార్

రామవరం, జూలై 12: ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐ టి.రమేష్‌కుమార్ వెల్లడించిన వివరాలు.. రామవరంలోని సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో పోలీసులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను ఆపారు. వారి నుంచి 4.5 కేజీల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. వీరిని రుద్రంపూర్ తండాకు చెందిన శివ, జూలూరుపాడు మండలం అనంతారం గ్రామానికి చెందిన వనమాల వేణుగా గుర్తించారు. వీరితో పాటు ఓ బాలుడు ఉన్నాడు. వీరి నుంచి ద్విచక్ర వాహనాన్ని, సెల్‌ఫోన్‌ను స్వాధీనపర్చుకున్నారు. వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై ఖాన్, ఏఎస్సై ఎస్తేరు రాణి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది లాల్‌సింగ్, రాజు, వెంకటేశ్వర్లు, వీరు, లక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

ఫైల్ డిజిటలైజేషన్ త్వరగా పూర్తి చేయాలి

మాట్లాడుతున్న ఏరియా డీజీఎం శివకేశవరావు

రామవరం, జూలై 12: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వివిధ మైన్స్, డిపార్ట్‌మెంట్లలోని ఉద్యోగుల పర్సనల్ ఫైల్ డిజిటలైజేషన్, వారి కుటుంబ సభ్యుల పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోల స్కానింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని ఏరియా డీజీఎం శివకేశవరావు ఆదేశించారు. ఆయన శుక్రవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో పర్సనల్ విభాగం అధికారులు, అన్ని మైన్లు, డిపార్ట్‌మెంట్ల సీనియర్ పీవోలు, వెల్ఫేర్ ఆఫీసర్లతో శుక్రవారం సమీక్షించారు. విశ్రాంత ఉద్యోగులకు సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ ద్వారా క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ త్వరగా జరిగేలా సూచనలు చేశారు. క్లెయిమ్‌ను ప్రతి నెల 10వ తేదీ లోపు పంపితే వెంటనే సెటిల్‌మెంట్ చేయవచ్చని అన్నారు. జీకే ఓసీ డీవైపీఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ పీవోలు ఎం.మురళి, కె.దేవదాస్, విజయ సందీప్, అజయ్, సంఘమిత్ర పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి

వీసీలో గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్

భద్రాచలం, జూలై 12 : ఉపాధ్యాయులు, హెచ్ఎంల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను అంతా పారదర్శకంగా నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ సంబంధిత డీడీ ట్రైబల్, డీటీడీవోలను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బదిలీల ప్రక్రియపై తీసుకోవాల్సిన కార్యాచరణపై ఆయన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో ఐదేళ్లుగా పనిచేస్తున్న హెచ్ఎంలు, ఎనిమిదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఉపాధ్యాయులను తప్పనిసరిగా కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేయాలన్నారు. 70 శాతం ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్న వారికి ప్రభుత్వం సూచించిన విధంగా వెసులుబాటు కల్పించి బదిలీ చేయాల్సి ఉంటుందన్నారు. జీవో 17 ప్రకారం ఈ నెల 12 నుంచి వచ్చే నెల 16 వరకు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. బదిలీలను సీనియార్టీ వారీగా నిర్వహించాలని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు తీసుకోగానే సీనియార్టీ జాబితాను డీటీడీవో కార్యాలయంలో ప్రదర్శించాలన్నారు. ఐటీడీఏలు లేనిచోట కలెక్టర్, అదనపు కలెక్టర్ కమిటీ ఆధ్వర్యంలో బదిలీలు చేపట్టాలన్నారు. బదిలీ, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, సిబ్బందికి వెంటనే ఉత్తర్వులు జారీ చేసి రిలీవ్, జాయిన్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, వివిధ జిల్లాల ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు, డీటీడీవోలు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జీఎం పర్సనల్ బీఆర్ దీక్షితులు

మాట్లాడుతున్న జీఎం పర్సనల్ దీక్షితులు

కొత్తగూడెం సింగరేణి, జూలై 12 : సింగరేణి సంస్థ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, వ్యయాన్ని తగ్గించుకొని ఉత్పత్తిని పెంచుకోవాలని జీఎం పర్సనల్(ఐఆర్ అండ్ పీఎం) బీఆర్.దీక్షితులు అన్నారు. స్థానిక ఇల్లెందు క్లబ్‌లో శుక్రవారం ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, అధికారులతో సంస్థ స్థితిగతులు, ప్రాజెక్టులు, భవిష్యత్ ఉత్పత్తి ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. జీఎం పర్సన ల్ దీక్షితులుతోపాటు జీఎంలు సురేశ్‌బాబు, సాయిబాబు, సుబ్బారావు, వీసం కృష్ణయ్యలు పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి అందరి సహకారం ఉండాలన్నారు. ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, అధికారులకు సంస్థ అభివృద్ధిపై అవగాహన కల్పించడంతోపాటు ఇందులో పాలుపంచుకోవాలన్నారు. బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా థర్మల్, సౌర, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి, ఇతర రంగాల్లో కూడా వ్యాపార విస్తరణ జరగాలని, అప్పుడే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుని భవిష్యత్‌లో సంస్థ మనుగడ కొనసాగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఎంఎండీఆర్ యాక్టు 1957పై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్, సీఐటీయూ, టీబీజీకేఎస్, సీఎంవోఏఐ సంఘం ప్రతినిధులు, నాయకులు, ఏజీఎం సీహెచ్.వెంకయ్య, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొత్తగూడెం అర్బన్, జూలై 12: పట్టణంలోని 25వ వార్డు గాజులరాజం బస్తీలో మున్సిపల్ సిబ్బంది శుక్రవారం ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాహిరా బేగం, మున్సిపల్ జవాన్ నవీన్, ఆర్‌పీ రాజకుమారి, ఓబీ సరోజ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలతో మంచి లాభాలు

రైతులతో మాట్లాడుతున్న రవీంద్రరావు

అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

టేకులపల్లి, జూలై 12: పంటల మార్పిడిలో భాగంగా రైతులు పండ్ల తోటల సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని ఎంపీడీవో రవీందర్‌రావు అన్నారు. మండలంలోని సులానగర్ గ్రామ రైతు అర్వ పాపారావు, తనకున్న రెండు ఎకరాలలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 150మామిడి, 30కొబ్బరి మొక్కల పెంపకాన్ని చేపట్టారు. దీనిని ఎంపీడీవో రవీంద్రరావు లాంఛనంగా ప్రారంభించారు. అక్కడకు వచ్చిన రైతులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఒకే భూమిలో ఒకే రకమైన పంటలు సాగు చేస్తే భూసారంతోపాటు దిగుబడి తగ్గుతుందని చెప్పారు. పంటల మార్పిడితో మంచి లాభాలు ఉంటాయన్నారు. అనంతరం గొల్లపల్లి, కొత్త తండా పంచాయతీల్లో అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఏపీవో కాలింగ్ శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు పవిత్ర, చిట్టి, వరుణ్, టీఏలు భీముడు, స్వప్న, వెంకటరమణ, ఎఫ్ఏలు లకన్, బాలాజీ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ 'జారె'.. పిల్లలు బేజారే..!

'ఎంకి పెళ్లి.. సుబ్బి చావుకొచ్చింది' అనేది ఓ సామెత. భారీ సైజులో కనిపిస్తున్న ఈ ఫ్లెక్సీని చూస్తుంటే ఈ సామెతే గుర్తుకొస్తున్నది. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నేతలు చండ్రుగొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేటుపై స్కూల్ బోర్డు కన్పించకుండా దీన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పుట్టిన రోజు గడిచిపోయి వారం రోజులవుతున్నా సదరు నేతలు దీన్ని తొలగించలేదు. వర్షాలకో, ఈదురుగాలులకో పొరపాటు ఇది ఊడి కింద పడినా, లేదా విద్యార్థుల మీద పడినా వారు బేజారయ్యే అవకాశం లేకపోలేదు. ఈ భారీ ఫ్లెక్సీ వల్ల ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ సదరు నేతలు దీని సంగతి మర్చిపోయారు. ఏదైనా ఘటన చోటుచేసుకుంటే 'ఎంకి పెళ్లి.. సుబ్బి చావుకొచ్చింది' అనే సామెతలా అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. అదీగాక.. స్వతహాగా ఉపాధ్యాయుడైన ఎమ్మెల్యే జారె ఆదినారాయణగానీ, అటు అధికారులుగానీ దీనిపై స్పందించలేదు. తన జన్మదినం పేరిట ఏకంగా ప్రభుత్వ పాఠశాల గేటుపైనే భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపైగానీ, దానిని ఇప్పటికీ తొలగించకపోవడంపైగానీ ఆయన ఇప్పటికీ నోరుమెదకపోవడం గమనార్హం. **–చండ్రుగొండ, జూలై 12**

ప్రభుత్వ పాఠశాల బోర్డుపై ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ, ఇన్‌సెట్‌లో పాఠశాల బోర్డు

పీహెచ్‌సీలో వనమహోత్సవం

మొక్కలు నాటుతున్న ఎంపీపీ రేసు లక్ష్మి

దుమ్ముగూడెం, జూలై 12 : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ములకపాడు పంచాయతీలో, దుమ్ముగూడెం పీహెచ్‌సీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, డాక్టర్ పుల్లారెడ్డి, సుకన్య, వెంకటేశ్, ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి సాహితి, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచంపట్టిన అనంతారం

జ్వరంతో బాధపడుతున్న అనంతారం గ్రామస్తులు

జూలూరుపాడు, జూలై 12: మండలంలోని అనంతారం గ్రామంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. కొన్ని ఇండ్లల్లో ఒకొక్కరు, మరికొన్ని ఇండ్లలో ఇద్దరు-ముగ్గురు చొప్పున మంచం పట్టారు. గత 15 రోజులుగా గ్రామంలో ఇదే పరిస్థితి. పీహెచ్‌సీ వైద్యులు ఈ గ్రామంలో రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వర పీడితులకు మందులు ఇచ్చారు. అయినప్పటికీ జ్వరాలు తగ్గడం లేదు. జ్వరం తగ్గిన వారికి కీళ్ల నొప్పులు వస్తున్నాయి. ఒక ఇంట్లో ఒకరికి జ్వరం తగ్గితే, మరొకరికి మొదలవుతున్నది. ఇలా జ్వరాలు వ్యాపిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనతో ఉన్నారు. పరిస్థితి విషమించిన కొందరు జ్వర బాధితులు సమీప పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. జిల్లా అధికారులు స్పందించాలని, గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చేంతవరకు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

నూతన చట్టాలపై అవగాహన

జూలూరుపాడు, జూలై 12: నూతన చట్టాలపై స్థానిక చండ్రుగొండ క్రాస్ రోడ్డులో ఆటో డ్రైవర్లకు సీఐ ఇంద్రసేనారెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఆటో నడుపుతున్నప్పుడు యూనిఫాం ధరించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ

చుంచుపల్లి, జూలై 12: న్యాయవాదులకు ప్రభుత్వం జారీ చేసిన హెల్త్ కార్డులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యం లో బార్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో భద్రాచలం, దమ్మపేట, మణుగూరు, ఇల్లెందు బార్ అసోసియేషన్ల ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

టేకులపల్లి, జూలై 12: తెలంగాణ ప్రగతిశీల ఆటో మోటర్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర 5వ మహాసభ ప్రచార పోస్టర్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరావు, నాయకుడు డి.ప్రసాద్ శుక్రవారం మండలం లోని కోయగూడెం ఉపరితల గనిలో కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 21న ఇల్లెందులో మహాసభ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.మోహన్‌రావు, నాయకులు సుధాకర్, నూనేశ్వరరావు, రేసు అంజయ్య, జగన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే

అశ్వారావుపేట టౌన్, జూలై 12: వర్షాలు కురుస్తుండడంతో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. పల్లెల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను గుర్తించి పారబోయించారు. నిల్వ నీటి ప్రదేశాల్లో దోమల మందును పిచికారీ చేశారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం, జూలై 12 : మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహదేవపురం, వైట్ నాగారం, కొత్త మారేడుబాక, రామారావుపేట, నిమ్మలగూడెం గ్రామాల్లో సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఇంటింటికీ తిరిగి సిబ్బంది అవగాహన కల్పించారు. ఫీవర్ సర్వే చేశారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కేవోసీ యార్డ్‌లో లారీ చోరీ

టేకులపల్లి, జూలై 12: మండలంలోని కోయగూడెం ఉపరితల గని(కేవోసీ)లో బొగ్గు లోడ్ కోసం వెళ్లిన, యార్డ్‌లో సీరియల్‌లో ఉన్న లారీని దొంగలు మాయం చేశారు. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. ఇల్లెందు స్టేషన్ బస్తీకి చెందిన ఎండి.ఖాజా సలీముద్దీన్ గత నెల (జూన్) 27న కోయగూడెం ఉపరితల గని లారీ యార్డ్‌లో తన లారీ(ఏపీ20టీబీ 9008)ని బొగ్గు లోడ్ కోసం సీరియల్‌లో ఉంచారు. జూలై 8న వచ్చి చూసే సరికి లారీ లేదు దీంతో ఆయన బోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తగూడెం టౌన్, జూలై 12: విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకున్న క్రైస్తవ మైనార్టీల నుంచి ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ సంక్షేమ శాఖ చైర్మన్ దీపక్ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్‌లోని విశ్వవిద్యాలయాల్లో తెలంగాణకు చెందిన క్రైస్తవ మైనార్టీలు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తుదారులు పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టొరల్ కోర్సుల్లో విదేశీ యూనివర్సిటీల్లో ఈ నెల 31వ తేదీలోపు ప్రవేశం పొంది ఉండాలని పేర్కొన్నారు. వచ్చే నెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అన్నపురెడ్డిపల్లి, జూలై 12: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ శాఖ అధికారి సాయి తరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంత టెండర్ రద్దు చేయాలి

కొత్తగూడెం టౌన్, జూలై 12: కొత్తగూడెం మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడేలా నిర్వహించిన వారాంతపు సంత టెండర్ ప్రక్రియను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, వంగా రవిశంకర్, కొండపాక మోహన్‌రావు, సమీర్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూలై 12: భద్రాద్రి దివ్యక్షేత్రంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, తదితర పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించి, కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పర్ణశాల రామున్ని దర్శించుకున్న అదనపు కలెక్టర్

పర్ణశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

పర్ణశాల, జూలై 12: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామున్ని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచవటిని దర్శించుకొని ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర లా సెక్రటరీని కలిసిన భద్రాచలం బార్ అసోసియేషన్

రాష్ట్ర లా సెక్రటరీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు

భద్రాచలం, జూలై 12 : భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చైతన్య ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర లా సెక్రటరీ ఆర్ తిరుపతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ.. భద్రాచలం ఏజన్సీలోని స్పెషల్ అసిస్టెంట్ ఏజంట్, సబ్ డివిజినల్ మేజిస్ట్రేట్ (మొబైల్ కోర్టు)కి రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరారు. అదేవిధంగా ఆయనతో ఏజెన్సీ చట్టాల గురించి, కోర్టు సమస్యలపై చర్చించారు. స్పందించిన ఆయన రెగ్యులర్ మేజిస్ట్రేట్‌ను నియమించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది టీ వసంతరావు, న్యాయవాదులు పాయం రవివర్మ, గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

అనంతారంలో అశాంతి

అశ్వారావుపేట రూరల్, జూలై 12: మండలంలోని ఓ చిన్న గ్రామం అనంతారం. 240 ఇళ్లు, 300 కుటుంబాలు ఉన్న ఈ ఊరు నిన్న మొన్నటి వరకూ చాలా ప్రశాంతంగా ఉండేది. ఇప్పుడు అశాంతికి నిలయంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, ఇంకా చెప్పాలంటే పార్లమెంట్ ఎన్నికలప్పటి నుంచి ఇక్కడ ప్రశాంతత కరువైంది. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజున బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెసోళ్లు దాడి చేశారు. ఉభయ పక్షాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. అధికార పార్టీ పెద్దల ఒత్తిడితో బీఆర్ఎస్ కార్యకర్తయిన గిరిజన యువకుడిని పోలీసులు కొట్టారంటూ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. తాజాగా, కాంగ్రెస్‌లోని రెండు ముఠాలు పరస్పర దాడులకు దిగాయి. పోలీస్ కేసులు నమోదయ్యాయి. ఈ గొడవలు, దాడులు, కేసులతో అనంతారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పల్లెలోని ప్రశాంతతను కొందరు దెబ్బతీస్తున్నారని, అశాంతిమయం చేస్తున్నారని ఆగ్రహంతో ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

జూలూరుపాడు, జూలై 12: స్థానిక పెండేల భాగ్యమ్మ స్మారక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ధరావత్ భాస్కర్, వాకపల్లి గీత, స్వర్ణకు మారి బదిలీ అయ్యారు. వారిని శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సన్మానించారు. పాఠశాలకు ఎల్ఈడీ టీవీని భాస్కర్, గోడ గడియారాలను గీత, ఆరు కుర్చీలను స్వర్ణకు మారి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో గుగులోత్ వెంకట్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ వెంకటనర్సయ్య, ఉపాధ్యాయుడు రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినవి
కొత్తపల్లి మమత, D/o. కొత్తపల్లి రామదాసు, వయస్సు : 26సం॥లు, నివాసం : ఇ.నెం. 1-66, నూతనకల్ గ్రామం, తల్లాడ మం॥, ఖమ్మం జిల్లా. అను నేను ఖమ్మం పాత బస్టాండు నందు బాతరూమ్‌కు వెళ్లగా నా ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్స్ పోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.
Cell: 95028 75314, 9705982608

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616